క్లుప్తంగా

గద్దర్ వర్ధంతి సభ



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ ప్రజానాట్యమండలి, రామగుండం నగర సమితి ఆధ్వర్యంలో మంగళవారం గద్దర్ ప్రథమ వర్ధంతి సభ నిర్వహించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు ఇనుముల రాజమౌళి, మడ్డి ఎల్లాగౌడ్, కవ్వంపల్లి స్వామి, వేల్పుల నారాయణ, గౌతం గోవర్ధన్, గోసిక మోహన్, కె.కనకరాజు, ఎంఏగౌస్, మాటేటి శంకర్, తాని రాజబాబు, చెప్యాల మహేందర్‌రావు, కళాకారులు దయా నర్సింగ్, ఎజ్జ రాజయ్య, నూకల మొండి, సంబోదు కొమురయ్య, తొడుపునూరి రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

కట్ట మైసమ్మతల్లికి ప్రత్యేక పూజలు



పూజల్లో కమిషనర్ వెంకటేశ్, కౌన్సిలర్లు

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని ఎల్లమ్మ చెరువు కట్ట సమీపంలోని కట్టమైసమ్మ తల్లి ఆలయంలో మంగళవారం కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్‌తోపాటు పలువురు కౌన్సిలర్లు, నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో మొక్కలు నాటారు.

సుష్మాస్వరాజ్ వర్ధంతి



నివాళి అర్పిస్తున్న నాయకులు

గోదావరిఖని: కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ వర్ధంతి మార్కండేయకాలనీలోని బీజేపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి, నాయకులు గుండబోయిన భూమయ్య, కోమల మహేశ్, అంకారపు భరత్, ఇరుగురాల శివకుమార్, అందె రాజుకుమార్, పంగ రవి, సుధీర్, విశ్వనాథ్, కుమ్మరి తిరుపతి, నవీన్ పాల్గొన్నారు.

ఆలయాల్లో శ్రావణ సందడి



పూజలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీవేంకటేశ్వర స్వామి, విశ్వకర్మ శివాలయం, శ్రీఅయ్యప్ప స్వామి, హనుమాన్ ఆలయాలతో పాటు పోతనకాలనీలోని శ్రీనాగుల మల్లికార్జునస్వామి ఆలయంలో శ్రావణ సందడి నెలకొంది. శ్రావణ తొలి మంగళవారం పురస్కరించుకొని కాలనీ హనుమాన్ ఆలయంలో అర్చకులు ఆంజనేయస్వామి మూలవిరాట్‌కు ఫల పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు హారతి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

బీసీ, మైనారిటీ హాస్టళ్లలో వసతులు సరిగా లేవు

గోదావరిఖనిటౌన్: హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మంగళవారం స్థానిక సప్తగిరికాలనీలోని ప్రభుత్వ బీసీ, మైనారిటీ హాస్టళ్లను నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ మూమెంట్స్ నాయకులు సందర్శించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ విద్యార్థులకు వసతులు సరిగా లేవని సమస్యలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ జస్టిస్ మూమెంట్ స్టేట్ సెక్రటరీ, జిల్లా అధ్యక్షుడు మహేందర్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కనకయ్య, వైస్ ప్రెసిడెంట్ రామరాజు, జిల్లా కన్వీనర్ శ్రీహరి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

సుల్తానాబాద్‌రూరల్: విద్యార్థి దశలోనే చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్సై శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని భూపతిపూర్ కస్తూర్బాగాంధీ విద్యాలయంలో మంగళవారం సైబర్ క్రైం, మహిళల చట్టాలపై ఎస్సై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ స్వప్న, విద్యార్థులున్నారు.

జయశంకర్ సార్ సేవలు మరువలేం



పెద్దపల్లిరూరల్: అమరవీరుల స్థూపం వద్ద నివాళి



యైటింక్లయిన్‌కాలనీ: టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో..



గోదావరిఖని: నివాళి అర్పిస్తున్న చందర్

పెద్దపల్లిరూరల్/గోదావరిఖని/సుల్తానాబాద్/ధర్మారం/కమాన్‌పూర్/కోల్‌సిటీ/మంథని/రామగిరి/గోదావరిఖనిటౌన్/యైటింక్లయిన్‌కాలనీ/ఎలిగేడు/ఓదెల/రామగుండం/జూలపల్లి: ప్రొఫెసర్ జయశంకర్ సార్ సేవలు ఎప్పటికీ మరువలేవని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు అన్నారు. జిల్లావ్యాప్తంగా ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు.

రామగుండం ఇక బిజినెస్ హబ్

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

కోల్‌సిటీ: బిజినెస్, మెడికల్ హబ్ లక్ష్యంగా రామగుండం నగరాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతోనే పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గోదావరిఖని రమేశ్‌నగర్ చౌరస్తాలో వివిధ అభివృద్ధి పనులకు నగర మేయర్ బంగి అనిల్‌కుమార్‌తో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, కార్పొరేటర్లు పాతపెల్లి లక్ష్మి, ఎండీ ముస్తఫా మహమ్మద్, ధరణి స్వరూప, మహంకాళి స్వామి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రామన్ పాల్గొన్నారు.



పాలకుర్తి: రైల్వే ఫ్లైఓవర్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ దంపతులు

చెట్లతోనే స్వచ్ఛమైన గాలి..

చెట్లతోనే స్వచ్ఛమైన గాలి వస్తుందని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అన్నారు. నగరపాలక సంస్థ చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనంలో భాగంగా గోదావరిఖని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో విద్యార్థులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు.

అభివృద్ధే ధ్యేయం

పాలకుర్తి: నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. బసంత్‌నగర్ సమీపంలో ఫోర్‌లేన్ రహదారిపై నిర్మించిన రైల్వే ఫ్లైఓవర్ వంతెనను మక్కాన్‌సింగ్ దంపతులు ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా కారు నడిపి వంతెనపై రాకపోకలు ప్రారంభించారు.

పేదలు, రైతులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రభుత్వం

ఎలిగేడు: ఆపదలో ఉన్న పేదలను, రైతులను ఆదుకునేది కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వమని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను మంగళవారం 78 మంది లబ్ధిదారులకు రూ.అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజలకు ఏ ఆపద వచ్చినా నిత్యం అందుబాటులో ఉండి సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీవో కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు. తహసీల్దార్ స్వర్ణ, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల సంక్షేమ ప్రభుత్వం

జూలపల్లి: సబ్బండ వర్గాల సంక్షేమానికి ఆరు గ్యారంటీలు పక్కాగా అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మంగళవారం స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమంలో ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 12 గ్రామాల్లోని 112 మంది లబ్ధిదారులకు రూ.23.22లక్షల విలువగల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. త్వరలోనే



జూలపల్లి: సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారి శంకర్, ఎంపీడీవో పద్మజ, తహసీల్దార్ బషీరుద్దీన్, ఎంపీవో అనిల్‌రెడ్డి, దూళికట్ట సింగిల్‌విండో చైర్మన్ వేణుగోపాలరావు, మాజీ జెడ్పీటీసీ లక్ష్మన్, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నర్సింహయాదవ్ పాల్గొన్నారు.

పోస్టుమార్టం వేగంగా చేయండి

సుల్తానాబాద్: పోస్టుమార్టానికి వచ్చిన ప్రతి మృతదేహాన్ని వేగవంతంగా పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించాలని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు డాక్టర్లకు సూచించారు. మండలంలోని సుద్దాల గ్రామానికి చెందిన శ్రీలత (48) అనే మహిళ మంగళవారం ఆత్మహత్య చేసుకోగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మినుపాల ప్రకాశ్‌రావు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలతో ముందుకెళ్తాం



నివాళి అర్పిస్తున్న పుట్ట మధు

మంథని: అణగారిన వర్గాల కోసం ఆరాట పడిన మహనీయుల స్ఫూర్తితో ముందుకెళ్తామని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి, ప్రజా యుద్ధనౌక గద్దర్ వర్ధంతి సందర్భంగా మంథనిలోని మధు నివాసంలో నివాళి అర్పించారు. అనంతరం బొక్కలవాగు వంతెనపై ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఆయన మాట్లాడుతూ ప్రొఫెసర్ జయశంకర్ సార్ తెలంగాణ సాధనలో ఉద్యమానికి ఊపిరిపోస్తే, గద్దరన్న తెలంగాణ ప్రజా చైతన్యం కోసం పని చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మంథనిలో గద్దర్ విగ్రహం ఏర్పాటు చేయాలని లేకుంటే బీఆర్ఎస్, పుట్ట లింగమ్మ ట్రస్టు ద్వారా నెలకొల్పుతామని ఆయన తెలిపారు.

సంక్షిప్త వార్తలు

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయాల్లో శ్రావణమాసం సందర్భంగా పూజలు నిర్వహించారు. పెరికగిద్దె హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఎల్‌వోసీ అందజేత

ముత్తారం: మండలంలోని ఓడెడ్‌కు చెందిన అనంతుల నాగభూషణం వైద్యం నిమిత్తం మంత్రి శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవ తీసుకొని సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.1.35లక్షల విలువైన ఎల్‌వోసీ మంజూరు చేయించారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ తెలిపారు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో మెకాళ్ల ఆపరేషన్ కోసం మంజూరైన ఎల్‌వోసీ పత్రాన్ని నాగభూషణానికి అందజేసినట్లు బాలాజీ పేర్కొన్నారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

గోదావరిఖనిటౌన్: జనగాం న్యాయవాదులైన గద్దల అమృతరావు, కవితపై అక్కడి పోలీసులు దురుసుగా ప్రవర్తించడాన్ని నిరసిస్తూ గోదావరిఖని న్యాయవాదులు మంగళవారం తమ విధులను బహిష్కరించారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొటం సతీశ్, ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆగస్టు 15లోపు మొత్తం రుణమాఫీ చేయాలి

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15లోపు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి తాండ్ర సదానందం కోరారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతుబంధు ఆపివేసిందని ఆరోపించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ సంబరాలు

రామగుండం: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పును హర్షిస్తూ మంగళవారం రామగుండం రైల్వేస్టేషన్ ఎదుట ఎమ్మార్పీఎస్ ప్రతినిధులు మంద కృష్ణమాదిగ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కొండల రాజేందర్‌కుమార్, ఎస్సీ పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బుసిపాక సంతోష్, దశరథం, రాజయ్య, రవి పాల్గొన్నారు.

జ్వరాల బారిన పడొద్దు

ముత్తారం: మండలంలోని అడవిశ్రీరాంపూర్‌లో మంగళవారం తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం ఆధ్వర్యంలో జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కళాకారులు ఆటపాటల అవగాహన కల్పించారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

రామగిరి: తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శారద అన్నారు. మండలంలోని కల్వచర్లలోని మూడు అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. అనంతరం చిన్నారులకు అక్షరభ్యాసం, అన్నప్రాసన నిర్వహించారు.

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ అల్లూరు అర్బన్ సెక్టార్ అంగన్వాడీ కేంద్రంలో మంగళవారం గర్భిణులకు సీమంతం చేశారు. చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాం నిర్వహించారు. సీడీపీవో రౌతు అలేఖ్య, సూపర్‌వైజర్ పద్మ పాల్గొన్నారు.

వ్యక్తిగత సమాచారం చెప్పొద్దు

పాలకుర్తి: అపరిచిత వ్యక్తులకు వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ ఖాతాల వివరాలు ఇవ్వొద్దని, సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని బసంత్‌నగర్ ఎస్సై స్వామి కోరారు. పాలకుర్తి మండలం ఈసాలతక్కళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాల నియంత్రణకు సంబంధించిన పోస్టర్‌ను ఎంఈవో రాజయ్యతో కలిసి ఆవిష్కరించారు.

అత్యవసర సేవలపై అవగాహన

జ్యోతినగర్: సైబర్ మోసాలకు 1930, అత్యవసర సేవలకు డయల్ 100కు సమాచారం అందించాలని షీ టీం ఇన్‌చార్జి మల్లయ్య సూచించారు. ఎన్టీపీసీ రామగుండం అన్నపూర్ణకాలనీలోని రావూస్ హైస్కూల్‌లో షీ టీమ్స్, విద్యార్థులకు భద్రత, ఆన్‌లైన్ మోసాలపై మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా వేధింపులకు గురి చేస్తే మహిళలు, విద్యార్థులు 63039 23700 నంబర్‌కు ఫోన్ చేసి సమస్య తెలపాలని కోరారు. షీ టీం సిబ్బంది స్నేహలత, సురేశ్ పాల్గొన్నారు.

అక్రమంగా భూమి పట్టా చేశారని నిరసన

కాల్వ శ్రీరాంపూర్: తమ భూమి తమకు సంబంధం లేకుండా తహసీల్దార్ అధికారులు ఇతరులకు ఎలా పట్టా చేశారని మండలంలోని మల్యాలకు చెందిన ఆరెల్లి రాజమల్లక్క కుమారులు శ్రీనివాస్, కుమారస్వామి ప్రశ్నించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. మల్యాల గ్రామ శివారులో గల సర్వే నంబర్ 376/అ(31 గుంట భూమి), 377/అ(27 గుంటల భూమి) మొత్తం ఎకరం 18గుంటల భూమి ఉండగా 15ఏళ్ల క్రితం మల్యాలకు చెందిన ఓ వ్యక్తికి పెద్ద మనుషుల సమక్షంలో భూమిని అమ్మగా కొంత డబ్బు చెల్లించారని తెలిపారు. అయితే మిగిలిన మొత్తం డబ్బులు చెల్లించకుండానే భూమిని మొత్తం అక్రమంగా పట్టా చేసుకున్నాడని వారు ఆరోపించారు. కలెక్టర్ స్పందించి తమ భూమి తమకు ఇప్పించాలని వారు కోరుతున్నారు.

కాంగ్రెస్ నేతకు నివాళి

ముత్తారం: ముత్తారంలోని కాసర్లగడ్డకు చెందిన కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు బాలసాని మొగిళిగౌడ్(62) అనారోగ్యంతో చనిపోయాడు. కాగా మంగళవారం మాజీ జెడ్పీటీసీలు చొప్పరి సదానందం, నాగినేని జగన్ మోహన్‌రావు మొగిళిగౌడ్ మృతదేహానికి నివాళి అర్పించారు.

తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలి

రామగిరి: తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని ఎంపీడీవో శైలజారాణి సూచించారు. మండలంలోని కల్వచర్ల, పన్నూర్, రత్నాపూర్, రత్నాపూర్, లద్నాపూర్ గ్రామాల్లో మంగళవారం తాగునీటి సంరక్షణ వర్షపు నీటి సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌చార్జి ఎంపీవో ఉమేశ్, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ శృతి పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని: మంథని మున్సిపాలిటీ పరిధిలోని వాటర్ ట్యాంకులను మంగళవారం శుభ్రం చేశారు. వర్షపు నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్, ఆయిల్ బాల్స్ వేశారు. వర్షం నీటి సంరక్షణకు ఇంకుడు గుంతల నిర్మాణాలకు అనువైన స్థలాలు గుర్తించినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రు రమ తెలిపారు.

ఎలిగేడు: మండలంలోని గ్రామాల్లో పిచ్చిమొక్కలను తొలగించి శుభ్రం చేశారు. ఎంపీడీవో భాస్కర్‌రావు, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

నిత్యం శుభ్రం చేయాలి

సుల్తానాబాద్: ప్రతిరోజు వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి సూచించారు. పట్టణంలోని పూసాల శాస్త్రినగర్, ఆరెపల్లిలో మంగళవారం ఆమె వాటర్ ట్యాంకులను పరిశీలించారు. ట్యాంకులను సిబ్బందితో శుభ్రం చేయించి, క్లోరినేషన్ చేయించారు.

రెండోరోజు స్వచ్ఛదనం–పచ్చదనం

పాలకుర్తి: మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం రక్షిత మంచినీటి ట్యాంక్‌లను శుభ్రం చేసి క్లోరినేషన్ చేశారు. బసంత్‌నగర్‌లో పారిశుధ్య నిర్వహణ పనులను ఎంపీవో సుదర్శన్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈసాలతక్కళ్లపల్లిలో పారిశుధ్యం లోపించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సోషల్ మీడియాలో వైరల్ అయిన కథనాలకు ప్రత్యేకాధికారి, మండల తహసీల్దార్ జ్యోతి స్పందించి గ్రామాన్ని సందర్శించారు.

విధుల్లో అప్రమత్తంగా ఉండాలి



పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇన్‌చార్జి జీఎం

రామగిరి: సింగరేణి కార్మికులు అనుక్షణం అప్రమత్తతతో విధులు నిర్వహించాలని, రక్షణ సూత్రాలు పాటించాలని సౌత్ సెంట్రల్ జోన్ మెకానికల్ డైరెక్టర్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ సుధీర్ గణపతిరావు భైసరే సూచించారు. ఏపీఏ గనిని మంగళవారం ఆయన సందర్శించారు. ఆర్జీ రీజియన్ సేఫ్టీ జీఎం కె.హెచ్.ఎన్.గుప్తా, ఇన్‌చార్జి జీఎం నాగేశ్వరరావు ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం వివిధ విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏరియా ఇంజనీర్ సీతారామం, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ సీ.హెచ్.వెంకటరమణ, ప్రాజెక్టు ఇంజనీర్ టి.రఘురాం, ఎస్‌వోఎం కె.జనార్దన్, సేఫ్టీ ఆఫీసర్ రమేశ్ పాల్గొన్నారు.



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ ఖాజీపల్లిలోని రోడ్లపై వర్షపు నీరు, మురుగు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. 15 రోజులుగా కురిసిన భారీ వర్షాలతో వర్షపు నీరు, మురుగు నీరు రోడ్లపై నిలిచి ఉండడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలు నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 97053 46608

రైల్వే సమాచారం (రామగుండం)

రామగుండం నుంచి ప్రతీ బుధవారం బల్లార్షా, వరంగల్ వైపు రాకపోకలు సాగించే వారాంతపు రైళ్లు

బల్లార్షా వైపు...

12512 రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ ఉదయం గం.10.00లకు
12707 సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ ఉదయం గం.08.29లకు
16031 అండమాన్ ఎక్స్‌ప్రెస్ రాత్రి గం.6.59లకు
07007 రాక్సల్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం గం.06.09లకు
17007 దర్బాంగా ఎక్స్‌ప్రెస్ అర్ధరాత్రి గం.01.49లకు

వరంగల్ వైపు...

12521 రప్తిసాగర్ ఎక్స్‌ప్రెస్ ఉదయం గం.09.26లకు
12577 భాగ్‌మతి ఎక్స్‌ప్రెస్ రాత్రి గం.11.05లకు
16318 హిమసాగర్ మధ్యాహ్నం గం.2.53లకు
22670 ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్ రాత్రి గం.08.40లకు
12772 రాక్సల్ ఎక్స్‌ప్రెస్ ఉదయం గం.3.25 లకు



వేములవాడ సమాచారం



వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి సన్నిధిలో శ్రావణమాసం సందర్భంగా భక్తుల రద్దీ కొనసాగింది. రాజన్న వసతి గదుల సమాచారం ఇలా ఉంది.

కాంప్లెక్స్ పేరు	మొత్తం	ఖాళీలు
అమ్మవారి కాంప్లెక్స్	08	0
భీమేశ్వర సదన్ ఏసీ	56	0
భీమేశ్వర సదన్ సూట్స్	04	0
భీమేశ్వర గెస్ట్‌హౌస్	05	0
నందీశ్వర కాంప్లెక్స్ ఏసీ	55	0
నందీశ్వర్ నాన్‌ఏసీ	112	60
నందీశ్వర సూట్స్	08	06
లక్ష్మీగణపతి కాంప్లెక్స్	94	45
పార్వతీపురం స్పెషల్	56	30
పార్వతీపురం సాధారణ	54	36

– వేములవాడ

రక్తం నిల్వలు

పెద్దపల్లిరూరల్: జిల్లా ప్రభుత్వాసుపత్రి బ్లడ్ బ్యాంకులో ఎ పాజిటివ్ ఒక యూనిట్, బి పాజిటివ్ 6 యూనిట్లు, ఓ పాజిటివ్ 12 యూనిట్లు అందుబాటులో ఉన్నాయని ల్యాబ్ ఇన్‌చార్జి సురేశ్ తెలిపారు. అత్యవసరంగా రక్తం కావాల్సిన వారు 94415 34430 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా మంగళగౌరీ వ్రతం



ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ గౌతమినగర్‌లో శ్రావణమాసం మొదటి మంగళవారం పురస్కరించుకొని అభయాంజనేయ స్వామి ఆలయంలో మంగళగౌరీ వ్రతాన్ని ఆలయ అర్చకులు రాపల్లి మురళీధర్ శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు.

బీజేపీ సభ్యత్వం పెంచాలి

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని ప్రతీ గ్రామంలో ఉన్న అన్ని సామాజిక వర్గాల ప్రజలను బీజేపీలో చేర్పించి సభ్యత్వం పెంచాలని రైల్వే ప్రజాసంబంధాల ప్రతినిధి క్యాతం వెంకటరమణ కోరారు. అంతర్గాం మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారులను గెలిపించేందుకు క్షేత్ర నాయకులు కృషి చేయాలని సూచించారు. సమావేశానికి మండల అధ్యక్షుడు బాణాల స్వామి అధ్యక్షత వహించగా బీజేపీ సీనియర్ నాయకులు బోడకుంట జనార్ధన్, బర్పటి నారాయణ, సిద్ధ లింగయ్య, సిలివేరి అంజి, లగిశెట్టి తిరుపతి పాల్గొన్నారు.

క్రైం న్యూస్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఓదెల: మండలంలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మడక గ్రామానికి చెందిన నేదురు రాజకొమురయ్య(45) చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పొత్కపల్లి ఎస్సై జి.అశోక్‌రెడ్డి వివరాల ప్రకారం రాజకొమురయ్య మడకలో పంక్చర్ కొట్టు నడిపేవాడు. మద్యానికి బానిస కాడడం, ఆర్థిక ఇబ్బందులతో జీవితంపై విరక్తిచెంది 4న ఇంట్లో పురుగుల మందుతాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స కోసం కరీంనగర్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడు భార్య దేవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

భోజన్నపేటకు చెందిన యువకుడు..

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలం భోజన్నపేటకు చెందిన కూనరపు రవికిరణ్ (31) అనే యువకుడు చికిత్స పొందుతూ మంగళవారం మరణించాడని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేసే రవికిరణ్ కొంతకాలంగా ఇంటివద్దే ఉంటున్నాడు. మానసిక ఒత్తిళ్లకు లోనై సోమవారం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి తల్లి పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సింగరేణి కార్మికుడు..

ముత్తారం: మండలంలోని ఓడెడ్‌కు చెందిన కలికోట వెంకన్న(55) అనే సింగరేణి కార్మికుడు హైదరాబాద్‌లో ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మహారాష్ట్రలోని బల్లార్షాలో సింగరేణిలో ఉద్యోగం చేస్తున్న వెంకన్న 9నెలల క్రితం జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. మృతుడికి భార్య లక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు ఉన్నారు.

పలువురు వ్యాపారులకు జరిమానా

ఓదెల: ఓదెల గ్రామంలోని షాపులను తూనికల కొలతల జిల్లా అధికారి విశ్వేశ్వర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన ఏడుగురి వ్యాపారులపై కేసు నమోదు చేసి రూ.29వేల జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు.